క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పామర్రు: ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో జేష్ఠ మాసం పౌర్ణమి మంగళవారం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలను చేసి విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పాల పొంగళ్లను స్వయంగా వండి స్వామికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. పూజలను ఆలయ అర్చకులు ఏ దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించామని ఈఓ ప్రసాదరావు పేర్కొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు. నిత్యాన్నదాన కార్యక్రమానికి దాత వెంట్రప్రగడకు చెందిన అశ్వినీకుమార్ రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు.

సీనియర్ అసిస్టెంట్‌గా ప్రియాంక

ముదినేపల్లి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా బి.ప్రియాంక నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రియాంక పమిడిముక్కల మండలం తాడంకి జెడ్పీ హైస్కూల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ ఉన్నతిపై ముదినేపల్లికి బదిలీ అయ్యారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా అరుణమ్మ



పెదపారుపూడి: నందివాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా సి.హెచ్ అరుణమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెదపారుపూడి, నందివాడ మండలాల్లో ఉన్న గ్రామాల్లో బెల్టు షాపులు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

ముదినేపల్లి రూరల్: ఖరీఫ్ సీజన్‌లో సార్వా వరిసాగుకు సంబంధించి విత్తన ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సొంతంగా విత్తన సేకరణ ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ అవకాశం లేని వారు నమ్మకమైన విత్తనం డీలర్ల నుంచి కొనుగోలు చేసుకోవాలన్నారు. కొనుగోలు సమయంలో వివరాలతో కూడిన రసీదులు పొందాలని తెలిపారు.

13న కొండలమ్మకు లక్ష మల్లెల పూజ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారికి లక్ష మల్లెల పూజను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పంతో పాటు తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- అనుమతులు నిల్
- అధికారుల ఆదేశాలు బేఖాతర్
- కూటమి సర్పంచ్ ఇష్టారాజ్యం



వేల్పూరు చెరువులో సాగుతున్న మట్టి తవ్వకాలు

పమిడిముక్కల: మండలంలోని వేల్పూరు పంచాయతీ చెరువులో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ తీర్మానం పేరుతో ఊరచెరువులో అక్రమ మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. రెండు పొక్లెయిన్లను ఏర్పాటు చేసి మట్టిని తీసి ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలిస్తున్నారు. డీపీఓ నుంచి అనుమతులు లేకుండా అక్రమ మట్టి తవ్వకంతో పంచాయతీకి ఆర్థిక నష్టం ఏర్పడుతుందని గ్రామస్తులు వీఆర్వో, కార్యదర్శి, తహసీల్దార్, ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అధికారులు వచ్చినప్పుడు గంట సేపు ఆగి మళ్లీ తవ్వకాలు కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలకే ఉపయోగించాలి

తొలుత చెరువు కట్టలను పటిష్టపరచటం, తరువాత గ్రామంలో ప్రభుత్వ స్థలాలను మెరకచేయడం కోసం మట్టిని వినియోగించాల్సి ఉండగా మట్టిని అమ్ముకుంటున్నారు. ఇదేమని అడిగితే 'ప్రభుత్వం మాది.. మాకెదురులేదు' అని అధికారుల అనుమతితో సంబంధంలేదని కూటమి సర్పంచ్ రత్నం దలీప్‌కుమార్ సమాధానం చెబుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువులో పరిమితికి మించి లోతుగా మట్టిని తీస్తున్నారని, దీనివల్ల పశువులు, మనుషులు దిగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమస్యపై ఆర్డీఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా మట్టి తవ్వకాలు మాత్రం ఆగడం లేదని చెబుతున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఒకరిపై మరొకరు చెబుతూ కాలక్షేపం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ లోపు మట్టి తవ్వకాలు పూర్తి చేసుకునేందుకు సర్పంచ్‌కు అవకాశం ఇస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

దోపిడీదారులకే అనుకూలం

కూటమి పాలనలో ప్రజలకు న్యాయం జరిగే అవకాశం లేదని, దోపిడీదారులకే అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మాజీ సర్పంచ్ తిరుమలశెట్టి బోసుబాబు, వనంబత్తిన వెంకటేశ్వరరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని, ఇప్పటివరకు తోలిన మట్టికి లెక్కలు తీసి జరిమానా విధించాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టానికి కృషి చేయండి



గ్రామ స్థాయి నియామక పత్రాలను అందిస్తున్న డీఎన్నార్

కైకలూరు: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ పటిష్టానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో ముదినేపల్లి, కోమర్రు, మణుగునూరులంక, మోఖసాకల్వపూడి గ్రామాల్లో గ్రామ స్థాయి కమిటీలకు మంగళవారం నియామకపత్రాలను అందించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీని పటిష్టం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ఏలూరు జిల్లా అర్గనైజింగ్ సెక్రటరీ జయమంగళ కాసులు పుట్టిన రోజు వేడుకను కార్యకర్తల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాము, బేతపూడి ఏసేబురాజు, బోయిన రామరాజు, కైకలూరు మండల పార్టీ వైస్ ప్రెసిడెంట్ పెంటా అనిల్‌కుమార్, నాయకులు సమయం రామాంజనేయులు, పంజా రామారావు, బుర్ల కిరణ్ పాల్గొన్నారు.

రోడ్డుపై భారీ గుంతతో ప్రమాదాలు



కైకలూరు బైపాస్ రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

కైకలూరు: కైకలూరు సంతమార్కెట్ నుంచి బైపాస్ రోడ్డు మలుపు వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నెల రోజులుగా ఈ పరిస్థితి కనిపిస్తోంది. సమీపంలోని పంచాయతీ వాటర్ సంప్ నుంచి నీరు రోడ్డుపైకి చేరడంతో భారీ గుంత ఏర్పడింది. ప్రధాన రహదారి కావడంతో అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ ఈఓ ఆనందభూషణాన్ని వివరణ కోరగా ఈ ప్రాంతంలో నీటి పైపు పగిలిందన్నారు. ఎక్కువ లోతులో మట్టిని తీసి మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పూడిక తొలగింపు పనుల పరిశీలన



పెదకొమ్ములేరులో పూడిక తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి(కైకలూరు): నియోజకవర్గంలో ప్రధాన డ్రెయిన్లు అన్నింటికీ పూర్తి స్థాయిలో పూడిక తొలగింపు పనులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. కలిదిండి మండలం వెంకటాపురం గ్రామం వద్ద పెదకొమ్ములేరులో జరుగుతున్న డ్రెయిన్ పూడిక పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా నిధులు సేకరించి గుర్రపుడెక్క తొలగించడానికి పంటును కొనుగోలు చేశారన్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో డ్రెయిన్ల కారణంగా లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడడంతోపాటు వరిపంటలు సైతం ముంపునకు గురవుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి సమస్యలు పునరావృత్తం కానివ్వబోమని చెప్పారు. కార్యక్రమంలో డ్రెయినేజీ డీఈ రామకృష్ణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విజేతలైన బాలికలకు బహుమతులు



పామర్రులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



గుడ్లవల్లేరులో బహుమతులను అందజేస్తున్న సూపర్‌వైజర్ వాణి



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పామర్రు: కిశోర వికాసం కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. పామర్రు 5వ సచివాలయం పరిధిలో కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం-5 ఎంఎస్‌కే రాధా స్రవంతి, ఏఎన్ఎం పీ స్వరాజ్యం, ఆశా ఏ అనిత, పి.రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఐ.ఉమాదేవి, పీ స్వరూపరాణి, పి.విజయజ్యోతి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం ఆఖరి రోజు కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే స్వాతి, అంగన్‌వాడీ టీచర్ పద్మజారాణి, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కిశోర బాలికలకు గుడ్లవల్లేరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రోత్సాహక బహుమతులను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి అందజేశారు. కిశోర వికాసంపై వేసవి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతల ప్రదానం చేశారు.



తోట్లవల్లూరులో అవగాహన ర్యాలీ

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీడీపీఓ విజయా ఫ్లారెన్స్ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే దుష్పరిణామాలు వివరించారు. ఆడపిల్లకు 18 ఏళ్లు పూర్తయ్యేవరకు వివాహం చేయకూడదన్నారు. ఈ సందర్భంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: మండలంలో కిశోర వికాశం కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, నాగమల్లేశ్వరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాశం ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం ఆవశ్యకత వంటి అంశాలపై సుజాత, నాగమల్లేశ్వరి అవగాహన కలిగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంఎస్‌కే శిరీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు కోకిలారాణి, పార్వతి, విజయకుమారి, రాణి, సలోమి, భాగ్యం, నాగమల్లేశ్వరి, లక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



యాకమూరులో అవగాహన కల్పిస్తున్న సువర్ణలత

తోట్లవల్లూరు: యాకమూరులో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను చేర్పిస్తే కలిగే లాభాలను కార్యకర్త సువర్ణలత వివరించారు. మూడేళ్లు నిండిన చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీకి పంపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆట, పాటలతో కూడిన విద్యను అందించటంతోపాటు గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం గురించి సువర్ణలత వివరించారు. ఏఎన్ఎం భాగలక్ష్మి, ఎంఎస్‌కే హిమబిందు, హెల్పర్ సుమ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ వాహనాలను కొనసాగించాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కంకిపాడు: రేషన్ పంపిణీ వాహనాలను కొనసాగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పీ రంగారావు డిమాండ్ చేశారు. రేషన్ పంపిణీలో నెలకొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. రంగారావు మాట్లాడుతూ ఎండీయూ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకులు ప్రజల ఇంటి వద్దకే చేరాయన్నారు. రేషన్ అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో డిపోల వద్ద నుంచి సరుకులు తెచ్చుకోవాలని సూచించటం సరైంది కాదన్నారు. అక్రమ రవాణాను అడ్డుకుంటూ ప్రజలకు ఇంటికే రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్ పంపిణీకి బదులుగా నగదు బదిలీ ఆలోచన ఉపసంహరించుకోవాలని కోరారు. పార్టీ నేతలు తాడంకి నరేష్, వి.శివశంకర్, సీహెచ్ శ్రీహరి, జి.కుమారి, కె.నాంచారయ్య, టీ దివ్యప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చక బృందం

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటి మీద వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. వేణు గోపాలరావు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన

గుడ్లవల్లేరు: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల వారు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గుడ్లవల్లేరు లయన్స్ సేవాభవన్‌లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్ రైతులకు అవగాహన కల్పించారు. వివిధ పంటల్లో సార్వా సాగుకు కావాల్సిన సూచనలు, నూతన సాంకేతికత పరిజ్ఞానం తదితర విషయాలపై భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

రేపు పింఛన్ల పంపిణీ

మొవ్వ: మండలానికి మంజూరైన వితంతు పెన్షన్లు గురువారం పంపిణీ చేయడానికి సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ జే విమాదేవి మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలానికి 91 పింఛన్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన నగదును ఆయా సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ బుధవారం సంబంధిత బ్యాంకు నుంచి డ్రా చేస్తారని పేర్కొన్నారు.

ఇంటింటి ఇలవేల్పు ఉప్పలమ్మ



అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు: తెలుగు రాష్ట్రాల్లో ఇంటింటి ఇలవేల్పుగా శ్రీ ఉప్పలమ్మ తల్లి విలాసిల్లుతుందని వేద పండితుడు కె.నరసయ్య అన్నారు. చంద్రాల శివారు సింగలూరులో శ్రీ ఉప్పలమ్మ తల్లి సంబరాల్లో భాగంగా శ్రీ యల్లమ్మతల్లి అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం నరసయ్య బృందం చేతుల మీదుగా చేపట్టారు. తెలంగాణా సంప్రదాయ పద్ధతిలో నిర్వహించే ఈ సంబరాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మజ్జిగ పంపిణీ

గుడివాడ టౌన్: భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద వికాస్ పరిషత్ సభ్యులు షా అదీష్ కుమార్ జైన్ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించారు. వికాస్ పరిషత్ అధ్యక్షురాలు పి. హారిక, కార్యదర్శి ఎ. వెంకటేశ్వరరావు, అదిల్ కుమార్, బొగ్గారపు తిరుపతయ్య, జ్ఞాన్‌చంద్ జైన్, జి.బాలకృష్ణ, జి. చైతన్య, రాధాకృష్ణ, వంశీ కిరణ్, రామ్మోహన్ పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న భారత్ వికాస్ పరిషత్ సభ్యులు

విద్యార్థినికి సత్కారం

కైకలూరు: ఏలూరులో ప్రతిభ అవార్డు అందుకున్న కైకలూరుకు చెందిన పెనుమూడి జ్యోత్స్నను మంగళవారం రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జేఎస్ మాల్యాద్రి తన కార్యాలయంలో రూ.5 వేలు నగదు బహుమతి అందించి సన్మానించారు. ప్రముఖ వైద్యులు పుల్లేశ్వరావు, 9వ వార్డు సభ్యుడు మంచికంటి శ్రీనివాసరావు, అద్దేపల్లి బ్రహ్మజీ, బొగ్గవరపు శ్యామ్, పైడిమరి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

పెనమలూరు: కానూరులో విద్యార్థి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు అమరావతి కాలనీకి చెందిన కొల్లంశెట్టి శివరోహిత్ విజయవాడలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. అతను ఈ నెల 4వ తేదీ నుంచి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తల్లి కొల్లంశెట్టి నాగహరిత ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశామని తెలిపారు.

అందుబాటులో వరి విత్తనాలు



గన్నవరం రూరల్: రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వై.రజిని మంగళవారం తెలిపారు. రైతులు వీటిని తీసుకోవచ్చన్నారు. సూరంపల్లిలో ఎంటీయూ1061- 30 కేజీల బ్యాగ్ రూ.1,110, ఎంటీయూ1318- 30 కేజీల బ్యాగ్ రూ.1,110, బీపీటీ 5204-30 కేజీల బ్యాగ్ రూ.950 వంతున అందుబాటులో ఉన్నాయన్నారు. పిల్లి పెసర్లు, పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై రైతులు పొందవచ్చని చెప్పారు.

అన్నసమారాధన

ముదినేపల్లి రూరల్: శ్రీహరిపురం శివారు ఐనంపూడిలో నిర్వహిస్తున్న బలుసులమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ప్రారంభించగా పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం గ్రామంలో బలుసులమ్మ సంబరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మండలంలోని కొరగుంటపాలెం నూతన రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు.



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న సర్పంచ్

ఉచిత వైద్యశిబిరం



తోట్లవల్లూరు: వల్లూరుపాలెంలో ఉచిత వైద్యశిబిరం మంగళవారం జరిగింది. కంకిపాడుకు చెందిన బాబా మెడికల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో ఎంజే నాయుడు హాస్పిటల్(విజయవాడ)కు చెందిన డాక్టర్ డాక్టర్ సందీప్, డాక్టర్ జాఫర్ 200 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కొనకాల వాసు, వేమూరి మల్లికార్జునరావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.